


# మార్పు

గురవయ్య బంధువు చనిపోయాడని కబురు వస్తే, బయల్దేరడానికి సిద్ధమవుతున్నాడు. ఇంతలో నలుగురు పెద్దమనుషులు గురవయ్య ఇంటికి వచ్చారు. వాళ్ళని హాల్లో సోఫాల్లో కూర్చోమని చెప్పి విషయం ఏమిటని అడిగాడు.

"గురవయ్యగారూ ! మీ సహాయం కోసం వచ్చాం" అన్నాడు రామారావు.

"చెప్పండి" అన్నాడు గురవయ్య.

"మేము బీద విద్యార్థులకు సహాయం చేయడానికి ఒక ట్రస్ట్ స్థాపించాం. ప్రముఖ పారిశ్రామికవేత్త రామప్రభుగారు ఏభై లక్షలు ఇచ్చారు. మన పట్టణంలో ధనవంతులందరినీ కలిసి వారిచ్చిన విరాళాలు బ్యాంక్‌లో వేసి, వడ్డీతో బీద విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు ఇవ్వాలని ఆశయం. మీకు తెలుసు. బీద విద్యార్థులు పదోతరగతి వరకు చదివి మానేస్తున్నారు. కొందరికైనా పై చదువులు చదువుకోవడానికి సహాయపడితే మన ఆశయం నెరవేరుతుంది. మీరు కోటీశ్వరులు మీ వంతు విరాళం గూడా ఇస్తే బాగుంటుంది."

వాళ్ళు చెప్పింది విని గురవయ్య తను ఆర్థిక ఇబ్బందుల్లో వున్నాననీ, తర్వాత చూద్దామనీ, ఇప్పుడు అత్యవసరంగా బంధువు చనిపోతే వూరెళ్తున్నాననీ చెప్పాడు. ట్రస్ట్ సభ్యులు నిరాశపడి వెళ్ళిపోయాడు.

గురవయ్య బయల్దేరి కొండాపురం వెళ్ళాడు. చనిపోయిన బంధువు శవాన్ని పాడె మీద వుంచారు. మొయ్యడానికి ముగ్గురే వున్నారు. గురవయ్యని మొయ్యమన్నారు. నేను స్నానం చేశాక మరో జత బట్టలు తెచ్చుకోలేదని తప్పించుకున్నాడు.

చాలాసేపటికి నాలుగో మనిషి దొరికాడు. నలుగురు మోసేవాళ్ళు తప్ప శవయాత్రలో ఇంకెవరూ లేకపోవడం గురవయ్యకి చాలా ఆశ్చర్యం కలిగించింది. ఆ మాటే అన్నాడు.

"ఈయన కాకులు తింటాయని ఎంగిలి చెయ్యి గూడా విసరడు. పిల్లికి బిచ్చం పెట్టడు. తను, తన కుటుంబం తప్ప ఎవరికీ సహాయం చెయ్యడు. ఎవరితోనూ సంబంధాలు లేకపోతే ఇతనికి ఎవరు మాత్రం వస్తారు." అన్నాడు ఒకాయన.

"కొడుకులు బాగా చదువుకుని అమెరికా వెళ్ళిపోయారు. కూతురు, అల్లుడు ఆస్ట్రేలియాలో వున్నారు. కబురు చేసినా ఎవరూ రావడానికి కుదరదన్నారు. అదీ పరిస్థితి."

గురవయ్య తిరుగు ప్రయాణంలో కారుకి ఒక వూరేగింపు అడ్డం వచ్చింది. డ్రైవరు కారు ఆపి డోర్ తీసుకుని వెళ్ళివచ్చాడు.

"ఏమిటయ్యా ఆ వూరేగింపు?" అని అడిగాడు గురవయ్య.

"ఊరి సర్పంచ్ గోపాలకృష్ణయ్యట సార్ ! చాలా గొప్ప మనిషట. ఆయన జీవితాంతం బ్రహ్మచారిగా వుండిపోయాడట. ఆస్తి మొత్తం దానధర్మాలు చేశాడట. ఎవరికి ఏ కష్టమొచ్చినా వెళ్ళి ఆదుకునేవాడట. జనం వేల మంది ఆయన అంతిమయాత్రలో పాల్గొంటున్నారు సార్ ! చాలా మంది స్వంత బంధువు పోయినట్లు ఏడుస్తున్నారు" చెప్పాడు డ్రైవర్.

గురవయ్యకి తన బంధువు, సర్పంచ్ బొమ్మబొరుసు లాగా కనిపిస్తున్నారు. తన బంధువు కోట్లు కూడబెట్టాడు. తనకి తన పిల్లలకు తప్ప ఎవరికీ ఉపయోగపడలేదు. మరొక పక్క సర్పంచ్ గోపాలకృష్ణయ్య ఊరంతా తనవాళ్ళే అనుకుని తనకు సంక్రమించిన ఆస్తి మొత్తం దాన ధర్మాలకు వినియోగించాడు.

"సార్ ! నేను ఎక్కడో చదివాను. ఒక వ్యక్తి చనిపోయినప్పుడు ఆయన లక్షాధికారి అనో, కోటీశ్వరుడనో చెప్పుకోవడం దురదృష్టకరం. ఆయన మహాదాత అనీ, ఫలానా

మంచిపని చేసిన మహానుభావుడనీ, కాలేజీ పెట్టించాడనో, గ్రంథాలయం కట్టించాడనో, బీద విద్యార్థులను చదివించాడనో చెప్పుకోవడం అదృష్టం అట." అన్నాడు డ్రైవర్.

గురవయ్యకు అతని మాటలు కొరడాల్లా తగిలాయి. తన గురించే ఆ మాటలు చెప్పాడేమో అనిపించాయి. తనుగూడా డబ్బు సంపాదించాడు. ఇప్పటివరకు తను తన కుటుంబానికి తప్ప ఎవరికీ ఏ సహాయం చేసింది లేదు.

తన పిల్లలు గూడా విదేశాల్లో వున్నారు. తను పోతే గూడా పిల్లలు అంత్యక్రియలకు హాజరవుతారని నమ్మకంలేదు. ఒక వ్యక్తి చనిపోయినప్పుడు శవాన్ని మోయడానికి నలుగురు దొరక్కపోవడం కంటే దురదృష్టం ఏముంది? అందుకే పెద్దవాళ్ళు నలుగురితో మంచిగా వుండమన్నారు. ఆ నలుగురి అవసరం ఏమిటో ఇప్పుడు గురవయ్యకి అర్థమైంది.

ప్రభు ఆఫీసులో ట్రస్ట్ బోర్డు సభ్యులు మీటింగ్‌లో వున్నారు. ఎడ్యుకేషన్ ట్రస్ట్‌కి వచ్చిన విరాళాలు ఇస్తామని కొందరు చేసిన వాగ్దానాలు పరిశీలిస్తున్నారు.

"మొత్తం ఇప్పటివరకు మూడుకోట్ల ఏభై లక్షలు విరాళాలు వచ్చాయి. ఇంకా ఏభై లక్షలు వాగ్దానాలున్నాయి. ఇంకొక కోటి వసూలుచేసి మొత్తం ఐదు కోట్లు బ్యాంక్‌లో డిపాజిట్ చేద్దాం. ఆ వడ్డీతో బీద విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు ఇద్దాం" అన్నాడు ప్రభు.

అంతా అలాగే చేద్దామని ఏకగ్రీవంగా ఆమోదించారు.

ఇంతలో అటెండర్ వచ్చి గురవయ్యగారు ప్రభుని కలవాలనుకుంటున్నట్లుగా చెప్పాడు. ఆయన్ని లోపలకు తీసుకురమ్మన్నాడు ప్రభు.

"గురవయ్య ఎందుకు వచ్చాడో? ప్రభుగారితో ఏదో పని వుండి వుంటుంది. ఆయన చుట్టాలెవరికో ఉద్యోగం కావాల్సి వచ్చి వుంటుంది. అందుకే వచ్చాడు."

"ప్రభుగారూ ! మన ట్రస్ట్‌కి డొనేషన్ ఇవ్వమని ఇంటికెళ్ళాం. రూపాయి ఇవ్వలేదు."

"గురవయ్యది అంతా వన్‌వే ట్రాఫిక్ తీసుకోవడమే గాని ఇవ్వడం చేతగాదు."

"ఏం చేసుకుంటాడు కోట్లు? పోయేటప్పుడు వెంట వస్తుందా? మనిషికి దాన గుణం లేదు."

ట్రస్ట్ సభ్యులు గురవయ్య గురించి రకరకాలుగా కామెంట్స్ చేస్తున్నారు.

"అందరూ మనలా వుండాలంటే ఎలాగండీ? ఎవరికి వారు స్వంత ఆలోచనలు కలిగి వుంటారు. అనుభవంతో అభిరుచులు ఏర్పరచుకుంటారు" అని నవ్వాడు ప్రభు.

ఇంతలో గురవయ్య హాల్లోకి వచ్చి "అందరికీ నమస్కారం. నేను మిమ్మల్ని డిస్టర్బ్ చేయడం లేదు కదా?" అన్నాడు.

"అదేం లేదు. రండి కూర్చోండి" అని ఆహ్వానించాడు ప్రభు.

"ప్రభుగారూ ! మీరు బీద విద్యార్థుల స్కాలర్‌షిప్పుల కోసం ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఏర్పాటు చేశారని మనవాళ్ళు మొన్న మా ఇంటికి వచ్చి చెప్పారు. మిమ్మల్ని అభినందిద్దామని వచ్చామండీ. మీరు ట్రస్ట్‌కి ఏభై లక్షలు ఇవ్వడం చాలా గ్రేట్" అన్నాడు గురవయ్య.

'రూపాయి ఇవ్వడానికి ప్రాణం ఒప్పలేదు గాని, అభినందించడానికి వచ్చారట' అని ట్రస్ట్ సభ్యులు గొణుక్కున్నారు.

'ఔను ప్రభుగారూ ! మీకు ఇటువంటి ట్రస్ట్ ఒకటి ఏర్పాటుచేయాలని ఎందుకు అనిపించింది. ఒక పని మొదలుపెట్టడానికి ఏదొక ప్రేరణ వుంటుందంటారు గదా? అందుకని అడుగుతున్నాను. ఏమీ అనుకోకండి" అన్నాడు గురవయ్య.

"ఇందులో అనుకోవడానికి ఏముంది గురవయ్య గారూ? మీరు అడిగింది సమంజ సంగానే వుంది. ఇన్నాళ్ళూ చెయ్యని పని ఇప్పుడీయన ఎందుకు చేస్తున్నాడనే సందేహం ఎవరికైనా రావడం సహజమే" అని ప్రభు చెప్పసాగాడు.

"నేను రకరకాల పరిశ్రమలుపెట్టి చాలా బిజీగా వుంటానని మీకు తెలుసుగదా? అలాగే ఒకరోజు ఉదయం నుండి చాలా బిజీగా వున్నాను. లంచ్ తర్వాత కరెంట్ పోయింది. అసలే ఎండాకాలం. ఏ.సీ. ఆగిపోయింది. గాలి లేక వుక్కపోత మొదలైంది. చెమట్లు పడుతుంటే గాలి కోసం ఆఫీసు బైటకు వచ్చి ఒక చెట్టుకింద నిల్చున్నాను. అటెండర్ ఒక కుర్చీ తెచ్చివేశాడు. నేను కుర్చీలో యధాలాపంగా గేటువైపు చూశాను. అక్కడ సెక్యూరిటీ కేబిన్ పక్కన ఒక కుర్రాడు నిల్చుని వున్నాడు. ఇరవై ఏళ్ళుంటాయేమో? అటెండర్‌ని పిలిచి ఆ కుర్రాడు ఎవరు? అని అడిగాను. దగ్గరికి రమ్మన్నాను. అతను బిడియపడుతూ వచ్చాడు.

"ఎవరు నువ్వు?" అని ప్రశ్నించాను.

"నా పేరు శివకుమార్ సార్ ! మా నాన్న మీ దగ్గర పనిచేసేవాడు. పేరేచర్ల ఫ్యాక్టరీలో ఫోర్‌మేన్ మా నాన్న పేరు కృష్ణారావు" అన్నాడు.

నాకు గుర్తొచ్చింది.

"ఐతే నువ్వు కృష్ణారావు కొడుకువన్నమాట. ఆయన చనిపోయి నాలుగేళ్ళయిందిగా! ఇప్పుడేంటి ? నీకు ఏదైనా జాబ్ కావాలా ?" అని అడిగాను.

"అది కాదు సార్ ! నాకు ఇంజనీరింగ్‌లో సీటొచ్చింది. ఫీజు కట్టి చేరాలి. అప్పు కోసం చాలా ట్రై చేశాను. ఎక్కడా దొరకలేదు. చివరకు మా అమ్మ మిమ్మల్ని కలవమని చెప్పింది. మీరు సహాయంచేస్తే...?" అని కుమార్ ఆగిపోయాడు.

నిస్సహాయ స్థితివల్ల అతని గొంతు పెగలడం లేదు. కళ్ళల్లోంచి నీళ్ళుకారుతున్నాయి. మాసిపోయిన డ్రెస్, చిందరవందరగా వున్న తల చూసి నాకు అతను ఎంత టెన్షన్‌లో వున్నాడో గ్రహించగలిగాను.

"ఎప్పుడు చేరాలి? ఎక్కడ?"

"రేపే చేరాలి సార్ ! హైదరాబాద్‌లో" అన్నాడు శివకుమార్.

"రేపే చేరాలి ఇప్పుడు సాయంకాలం నాలుగైంది. ఇప్పటివరకూ ఎందుకున్నావ్? ముందే కలవొచ్చుగా?" అన్నాను చిరాకు పడుతూ.

శివకుమార్ ఏమీ మాట్లాడలేదు.

"సరే ! నువ్వు వెంటనే ఇంటికెళ్ళి లగేజీతో రైలుస్టేషన్‌కి వచ్చేయ్. పన్నెండు గంటలకు నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ గుంటూరు స్టేషన్‌లో బయల్దేరుతుంది. తెల్లవారేసరికి హైదరాబాద్ చేరుతుంది. స్టేషన్లో మా అటెండర్ టికెట్ తీసుకుని రెడీగా వుంటాడు" అన్నాను.

శివకుమార్ ముఖంలోకి ఒక్కసారిగా కళ వచ్చింది. చనిపోయిన శవంలోకి జీవం వస్తే ఎంత మార్పు వస్తుందో అతనిలో అటువంటిది వచ్చింది.

"అలాగే సార్ !" అన్నాడు.

"నువ్వు స్టేషన్‌లో దిగి హైదరాబాద్‌లో మా ఆఫీసుకి వెళ్ళు. నిన్ను ఇంజనీరింగ్ కాలేజీకి తీసుకెళ్ళి ఫీజుకట్టి చేరుస్తారు. నువ్వు చదువుకున్నంత కాలం ఫీజులు, హాస్టల్లో మెస్ ఛార్జీలన్నీ మావాళ్ళే చెల్లిస్తారు. నువ్వు శ్రద్ధగా చదివి ఇంజనీర్‌వి కావాలి. ఈ రోజు నుంచి నువ్వు మా కుటుంబంలో మనిషివి. నా కొడుకుతో సమానం" అన్నాను.

శివకుమార్ అమాంతం నా పాదాలపై పడిపోయాడు. ఉద్వేగం అపుకోలేక కన్నీళ్ళు కార్చాడు. నేను అతన్ని లేవదీసి భుజంతట్టి పంపాను.

ఆ సమయంలో నాకు ఎంతో తృప్తికలిగింది. ఎందుకో నాకు శ్రీకృష్ణుడు, కారల్ మార్క్సు జ్ఞాపకం వచ్చారు. భగవద్గీతలో శ్రీకృష్ణుడు ఏమి ఉపదేశించాడు? ఇతరులకు సహాయం చేసేవాడే నాకు ఇష్టుడైన భక్తుడు అన్నాడు. కారల్ మార్క్స్ గూడా దాదాపు అలాగే చెప్పాడు. ఒక మనిషి నిజమైన ఆనందాన్ని పరులకు సహాయం చేయడంలోనే పొందగలడు అన్నాడు.

నేను అటువంటి ఆనందాన్ని శివకుమార్‌కి సహాయం చేసినప్పుడు అనుభవించాను. అటువంటి ఆనందం తాత్కాలికంగా పొందడమే కాకుండా జీవితాంతం పొందడం ఎలాగా?

అని ఆలోచించి ఈ ఎడ్యుకేషన్ ట్రస్ట్‌కి రూపకల్పన చేశాను. నాలాగే ధనవంతులంతా ఇతరులకు సహాయపడడంలో ఆనందం పొందాలని నా ఆశయం" చెప్పడం ముగించాడు ప్రభు.

ట్రస్ట్ బోర్డు సభ్యులంతా చప్పట్లు కొట్టారు.

గురవయ్య అందరూ చప్పట్లు కొట్టినా తను ఇంకా అలా చప్పట్లు కొడుతూనే వున్నాడు. అందరూ ఆయన్నే చూస్తున్నారు.

"గురవయ్యగారూ ! ఇక ఆపండి. నాకు సిగ్గుగా వుంది" అన్నాడు ప్రభు నవ్వుతూ.

"ప్రభుగారూ ! మీ టట్స్‌కి నేను గూడా సహాయపడాలని నిశ్చయానికి వచ్చాను" అన్నాడు గురవయ్య.

"చాలా సంతోషం." అని ట్రస్ట్ బోర్డు సభ్యులవైపు చూశాడు ఇప్పుడేమంటారు? అన్నట్లు ప్రభు.

"నేను ఒక రూపాయి ఇవ్వదల్చుకున్నాను." అంటూ బ్యాగ్ జిప్ తెరిచాడు.

అంతా నోళ్ళు తెరిచారు. కొందరు నవ్వు ఆపుకోలేక పకాపకా నవ్వారు.

"మీరిచ్చే రూపాయి చెల్లుతుందంటారా?"

"రూపాయికి చెక్ రాస్తున్నారా? అది బ్యాంక్ వాళ్ళు యాక్సెప్ట్ చేస్తారా?"

గురవయ్య ఎవరి మాటలూ పట్టించుకోకుండా చెక్ రాసి తీసుకెళ్ళి ప్రభు చేతికి ఇచ్చాడు.

ప్రభు అది చూసి ముసిముసి నవ్వులు నవ్వాడు.

"గురవయ్యగారి చమత్కారం మీకు అర్థంకాలేదు. ఆయన రూపాయి ఇవ్వదల్చుకున్నానంటే అర్థం. నేను ఇచ్చిన విరాళంకంటే ఒక రూపాయి ఎక్కువన్న మాట. ఆయన ఏభై లక్షల ఒక రూపాయికి చెక్ రాసిచ్చారు" అన్నాడు ప్రభు.

అంతా ఆశ్చర్యపోయారు. గురవయ్య ఒక్కసారిగా ఎలా మారిపోయాడు? ఎవరికీ అర్థంకాలేదు. సభ్యులంతా తేరుకుని గురవయ్యని అభినందనలతో ముంచెత్తారు.

–ఆంధ్రభూమి దినపత్రిక *25-1-2009*